❖•❖•❖ 21 ❖•❖•❖

# విమోచనను మించినది

*"ఆయన హేరోదు అధికారము క్రింద ఉన్న ప్రదేశపువాడని తెలిసికొని హేరోదునొద్దకు ఆయనను పంపెను. హేరోదు ఆ దినములలో యెరూషలేములో ఉండెను" (లూకా 23:7).*

పిలాతు యేసుతో వ్యక్తిగతముగా జరిపిన విచారణలో యేసులో ఏ దోషమైనను కనుగొనలేదని ఆయన ప్రధానయాజకులకు ప్రకటించిన తరువాత (లూకా 23:4), యూదుల ఈ అధికారులందరు, ఒక విధంగా కంగారు చెందినవారై ఉన్నట్లుండి కోపోద్రేకంతో దొమ్మిగా బయటికి వచ్చారు. బిగ్గరగాను, తీవ్ర ఉద్రిక్తతతోను, అస్తవ్యస్తమైన అరుపులతో నిండిన అపనింద పరంపరలతో కూడిన కేకలు పిలాతు చెవుల్లో మారుమ్రోగాయి. "ప్రధాన యాజకులు ఆయనమీద అనేకమైన నేరములు మోపసాగిరి" అని వ్రాస్తూ మార్కు ఈ మాటలను కొంచెము మృదువుగా పలికాడు (మార్కు 15:3). వారు చేయుచుండిన ఆరోపణ లలో, యేసు "గలిలయ దేశము మొదలుకొని ఇంత వరకును యూదయ దేశమందంతట ఉపదేశించుచు ప్రజలను రెచ్చగొట్టుచున్నాడు" అని పదే పదే మోపుచుండిన నిందయై యుండినది (లూకా 23:5).

ఆ సందడి దొమ్మిగా ఉండిన సమయంలో సహితము "గలిలయ" అను పదము పిలాతు చెవులకు ఘాటుగా వినబడింది. హేరోదు యెరూషలేములో ఉన్నాడనియు, యేసు తన బోధలను అత్యధికంగా చేసిన చోటు కూడా హేరోదు పరిపాలనా పరిధిలోనికి రావచ్చుననియు, పిలాతు ఆకస్మికముగా గుర్తుకు తెచ్చుకొన్నాడు. "ఆయన హేరోదు అధికారము క్రింద ఉన్న ప్రదేశపువాడని తెలిసికొని, హేరోదునొద్దకు ఆయనను పంపెను.

హేరోదు ఆ దినములలో యెరూషలేములో ఉండెను" అని లూకా వ్రాయుచున్నాడు (లూకా 23:7). పస్కాను ఆచరించుట కొరకు హేరోదు యెరూషలేములో ఉండుటకు తిబెరియలోని తన నివాస స్థలము నుండి పయనించి వచ్చాడు. హేరోదు యెరూషలేములో ఉండుటనుబట్టి, యూదుల వలన అతడు (పిలాతు) దయపొందుదుననుకొన్నాడు. ఆయన యెరూషలేమును సందర్శించుట చరిత్రలోని అతి గొప్ప తీర్పుతో ఆయనను ముడిపెడుతుందని లేశమాత్రమైనను అతనికి తెలిసియుండలేదు. సరికదా, యేసుతో కూడ ఏకాంతముగాను వ్యక్తిగతముగాను సంభాషించుటకు ఒకే ఒక అరుదైన అవకాశము కూడ అతనికి దొరకబోతుందని అతడు గ్రహించలేదు. యేసును ఏమి చేయాలో హేరోదుకు తెలిసియుంటుందని అనుకొని, పిలాతు యేసును హేరోదు నొద్దకు ఆతురముగా పంపించాడు. బంధింపబడిన యేసు ఉన్నపాటుననే హేరోదు యెదుటికి తీసికొనిపోబడినప్పుడు, రోమా ప్రభుత్వ తీర్పుల రెండవ దశ ప్రారంభమయ్యింది.

యేసు అతని యెదుట నిలువబడనై యుండిన ఈ ఉన్నతాధికారి, చతుర్థాధిపతియైన హేరోదు అంతిపయై యుండెను (లూకా 3:1). ఆయన తన తండ్రి, మహా హేరోదు మరణానంతరము తండ్రి ఆసనముపై ఆసీనుడయ్యాడు. ఈయన జ్ఞానుల ద్వారా యేసు జననము గూర్చి తెలిసికొని, రెండు సంవత్సరములు మొదలుకొని తక్కువ వయస్సుగల మగపిల్లలందరు హతమార్చబడవలెనని శాసించి చెడు విషయములలో సర్వాత్రా అప్రతిష్ఠాపూర్వక రాజైయుండెను. "తండ్రిని పోలి తనయుడు" అను నానుడి ప్రకారము, హేరోదు అంతిపయ నిరర్థకముగాను, నిరంకుశ నియంతగాను, నిరర్థమైనవాడునై యుండెను. ఆయన రోమా పట్టణంలో, చక్రవర్తియైన తిబెరియ కుమారునితో కూడ తన విద్యనభ్యసించాడు. ఈ విధ్యాభ్యాసము వలన అతడు సాంస్కృతికంగా, ప్రత్యేకించి లలిత కళ ప్రపంచంలో ఎంతో ప్రావీణ్యంగలవాడయ్యాడు. మరొకసారి, ఆయన రోమా పట్టణమును సందర్శించినప్పుడు అధికారములలో నున్న వారికి తన మీద దయకలుగునట్లు చేసికొనుటకు, హేరోదియతో ప్రేమాయణం మొదలుపెట్టాడు. క్రొత్త నిబంధనలోని ఈ యెజెబెలు హేరోదు సహోదరుడైన ఫిలిప్పు భార్య, అటుతరువాత, ఆక్రమ ప్రేమాయణము చేత ఆతురముగా తరుమబడి, అరేబియా దేశానికి చేందిన తన భార్యను బహిష్కరించి హేరోదియ తన భర్తయైన ఫిలిప్పును విడిచిపెట్టి తనతో కూడ కాపురము చేయవలెనని బలవంతంచేశాడు. అతని సిరిసంపదలను అధికారమును ప్రదర్శించుటకు అట్టహాసమైన విందులు ఆడంబర పూర్వకమైన వినోదాలకు అలవాటుపడిపోయాడు. కాలము దొర్లిపోయిన కొలది, అధమాధమమైన ఇచ్ఛలకు మరులుగొల్పబడి విడిపించుకోలేనంతటి బానిసయైపోయాడు.

అరణ్యములో ఆయన యూదా దేశ ప్రజలకు ఏమేమి బోధించుచున్నాడో తెలిసికొనుటకు బాప్తిస్మమిచ్చు యోహానును తన సమక్షమునకు పిలిపించినప్పుడు హేరోదు సత్యముతో సంఘర్షణపడ్డాడు. బాప్తిస్మమిచ్చు యోహాను సందేశముచేత హేరోదుకు అంతుపట్టని ఆశ్చర్యం కలిగింది, కానీ సత్యమునకు అతని హృదయములో స్థలము లేకుండెను. "నీవు నీ సోదరుడైన ఫిలిప్పు భార్యయగు హేరోదియను ఉంచుకొనుట న్యాయము కాదు" అని చెప్పుచూ, అతని అక్రమ వివాహేతర సంబంధమును గూర్చి యోహాను అతనిని గద్దించినప్పుడు (మత్తయి 14:4) ఆగ్రహము చెందిన హేరోదు హేరోదియచేత ప్రోద్బలము చేయబడి యోహానును చెరసాలలో వేయించాడు. కొన్ని మాసముల తరువాత, అతని జన్మ

దిన వేడుకల సందర్భములో మితిమీరి విచ్చలవిడిగాను అతి వ్యామోహంలోను ఉండిన ఒక నాటి రాత్రిలో, తన సవతి కూతురు, సలోమి చేసిన నాట్యమును చూచిన హేరోదు ప్రగాఢ ఆవేశంతో ఉప్పొంగిపోయాడు. అవివేకియైన హేరోదు, ఆమె ఏమి కోరినను దానిని ఆమెకిచ్చునని ప్రమాణపూర్వకంగా వాగ్దానం చేశాడు (మత్తయి 14:7). తన తల్లి ప్రేరేపణ ప్రకారము, యోహాను తల పళ్లెములో పెట్టి ఆమెకు ఇప్పించవలెనని ఆమె కోరింది. "రాజు దుఃఖపడినను తాను చేసిన ప్రమాణము నిమిత్తమును, తనతో కూడ భోజనమునకు కూర్చున్నవారి నిమిత్తమును ఇయ్యనాజ్ఞాపించెను" అని మత్తయి వ్రాశాడు (మత్తయి 14:9). ఈ దుష్ట నిర్ణయము తీసికొనిన కొంత కాలము వరకు, అతడు చేసిన దుష్ట చర్య అతనిని వెంటాడుచునే యుండినది (మత్తయి 14:2 చూడుము).

హేరోదు సింహాసనము మరియు రాజభవనము గలిలయలో ఉండుటవలన ఆయన యేసు బోధలు వినుటకు ఆస్కారముండెను, ఏలయనగా యేసు గలిలయ ప్రాంతంలో దాదాపుగా రెండు సంవత్సరముల కాలము బోధించాడు. సామాన్య ప్రజానీకము యేసు బోధలను ఎంతో సంతోషముతో విన్నారు. ఆయన రోగులను, పక్షవాయువుగలవారిని స్వస్థపర్చాడు, దయ్యములు పట్టి పీడింపబడుచుండిన వారిలోనుండి దయ్యములను వెళ్లగొట్టాడు. యేసును గూర్చిన సమాచారము ఆ ప్రాంతమందంతటను వ్యాపించింది; ఏది ఏమైనా, హేరోదు యేసును ఎన్నడును వ్యక్తిగతముగా కలిసికొనలేకపోయాడు.

సైనికులు యేసును తీసికొని ఆయనతో కూడ హేరోదు ఆసీనుడైయుండిన చోటికి వెళ్లినప్పుడు, హేరోదు సంతోషించాడు. యేసును చూచుటకు అందుబాటులో ఉండిన ఈ అవకాశమును గొప్ప ఆహ్వానముగా అందుకొన్నాడు. "హేరోదు యేసును చూచి మిక్కిలి సంతోషించెను. ఆయననుగూర్చి చాల సంగతులు విన్నందున ఆయన ఏదైనను ఒక సూచక క్రియ చేయగా చూడ నిరీక్షించి, బహుకాలమునుండి ఆయనను చూడగోరెను" అని వాక్యభాగము చెప్పుచున్నది (లూకా 23:8). అతని ఆసక్తి అంతా యేసు బోధించిన సత్యమును గూర్చినది కాదు; ఆయన సత్యమును గ్రహించ లేకుండినంతగా దుష్టునికి బానిసయైపోయాడు. లేదు, సత్యమును గూర్చి కాదు గాని యేసు అతని యెదుట ఏదైన ఒక అద్భుతము చేసి ఆయనకు వినోదము కలిగించవలెనని ఆశించాడు. దేవుని సేవించాలను మనస్సు అతనికి లేదు; దేవుడే అతనికి సేవ చేయాలని ఆశించాడు!

ఆయన యేసును ప్రశ్నడుగుటకు మొదలుపెట్టాడని వాక్యభాగము చెప్పుచున్నది. "ఆయనను చూచినప్పుడు చాల ప్రశ్నలువేసినను ..." (లూకా 23:9ఎ) అని వ్రాయబడి యున్నది. ఆయన అడిగిన ప్రశ్నలు నిస్సారమైనవి, అవి నిరర్థకమైన ప్రశ్నలు, న్యాయవిరుద్ధమైన ఆదర్శపురుషుడు అడుగునటువంటి ప్రశ్నలు. యేసు ఆ ప్రశ్నలలో దేనికైనను సమాధానమిచ్చుట ద్వారా వాటిని ఆదరించలేదు. "ఆయన అతనికి ఉత్తరమేమియు ఇయ్యలేదు" అని లూకా చెప్పుచున్నాడు (లూకా 23:9బి). యేసు హేరోదు దగ్గరకు వచ్చినది మొదలుకొని అక్కడ నుండి వెళ్లిపోయినంత వరకు, ఆయన హేరోదుతో ఏమియు మాటలాడలేదు. ఈ సమయంలో, హేరోదు ఆసీనుడైయుండిన ఆదరణ ప్రాంగణమునకు ఊరేగింపుగా వచ్చి చేరిన, ప్రధాన యాజకులు మరియు శాస్త్రులు, "ఆయనపై తీక్షణముగా నేరము మోపిరి" (లూకా 23:10). అనగా, యేసుతో కూడ నుండుటకు అతనికి దొరికిన విశిష్టమైన సదవకాశము యేసు శత్రువులు దేవుని కుమారుని ఖండింపవలెనని చేయుచుండిన ప్రయత్నములో వారి మనస్సుకు

వచ్చిన మాటలు ఉచ్చరించుచూ బిగ్గరగా కేకలువేయుచు వెర్రిగా దిగజారిపోవునట్లు హేరోదు అనుమతించాడని, మరొక మాటలో చెప్పుకొనవచ్చును. దేవదూతలు యేడ్చియుందురు: దేవుని భక్తిభయములేనిదియు దేవదూషణ చేయుచుండినదైన ఈ కయ్యమును చూడలేక తన కళ్లను ప్రక్కకు త్రిప్పుకొనియుండును. దేవుని పోలికగా చేయబడిన మానవులు, ఇంతటి కఠిన హృదయులై దిగజారిపోవుట వారికి ఎలా సాధ్యమౌతుంది?

హేరోదైతే అంత కంటె మరి ఎక్కువగా దిగజారిపోయి, యేసును పిలాతు నొద్దకు తీసికొని వెళ్లక మునుపు ఆయనను ఎగతాళిచేయవలెనని తన సైనికులకు సంకేతమిలిచ్చాడు. "హేరోదు తన సైనికులతో కలిసి, ఆయనను తృణీకరించి అపహసించి, ఆయనకు ప్రశస్తమైన వస్త్రము తొడిగించి పిలాతు నొద్దకు మరల పంపెను" అని లూకా వ్రాస్తున్నాడు (లూకా 23:11). తాను ఎంతటి భయానకమైన బీభత్సవమును సృష్టించాడో హేరోదు బహుశ ఎన్నడు అర్థంచేసికొని యుండడు. అతని హృదయం దానిని అవగాహన చేసికొనలేనంతగా రోగగ్రస్తమై యుండింది. ఈ సంఘటన మూలమున అవినీతిమయమైన అతని ఆత్మ మరి ఎక్కువ అవినీతిమయమగునట్లు చేసికొన్నాడు. లూకా ఇలా వ్రాస్తున్నాడు: "అంతకు ముందు హేరోదును పిలాతును ఒకనికొకడు శత్రువులై యుండి ఆ దినముననే యొకనికొకడు మిత్రులైరి" (లూకా 23:12). హేరోదు యేసును గూర్చిన "తీర్పు" అని మనము పిలుచు సంవత్సర క్రమములో జరిగిన సంఘటనల చరిత్ర అంతటిలోని దుష్కృత్యమను ఈ మురికి నీటి గుంట కంటే, ఇంతగా దిగజారిపోయిన సంఘటన – ఎక్కువగా అపవాది అదుపులో ఉండిన సంఘటన, దుర్మార్గత గూర్చి ఎక్కువగా సంగ్రహించి వ్రాయబడగల సంఘటన, – మరొకటి లేదు.

రెండువేల సంవత్సరముల నాటి కోణములో మనము ఈ సన్నివేశమును చూచినప్పుడు, మనము వణికిపోతాము. విమోచనను అధిగమించి అవతలికి వెళ్లిన ఆత్మను మనము చూచుచున్నాము, యేసు ఏమియు చెప్పలేకపోయిన ఒకనిని మనము చూచుచున్నాము. యేసు అన్నతోను, కయపతోను, మరియు పిలాతుతోను మాట్లడాడు; కానీ హేరోదుతో మాట లాడుటకు ఆయన యొద్ద ఏమియు లేకుండెను.

*యేసు అతని యొద్దకు తీసికొనిపోబడక మునుపే హేరోదు శిక్షవిధింపు రేఖను దాటివెళ్లిపోయాడు.* అతని నీతిబాహ్యామైన జీవితము ద్వారా, ఆయన నీతిమంతమైన ఆలోచనను ఒక్కదానినైనా ఆలోచించలేనంత అవినీతిమయముగా హేరోదు హృదయము వృద్ధిపొందినది. ఆయన హృదయము కుళ్లిపోయిన కర్రవలె అయినది; ఆత్మ ఖడ్గము దానిని ఏమాత్రమును సరిచేయలేకపోయింది. అతని హృదయము ఎటువంటి దైవచిత్తానుసారమైన దుఃఖమును ఆహ్వానించలేక పోయింది లేక పశ్చాత్తాపపడుటకు ఆశ లేశమాత్రమైనని కలిగియుండలేకపోయింది. ఆయన క్రీస్తు విషయము ప్రతిస్పందించక పోవుట, ఈ స్థితికి చేరుకొను వారందరి విషయములో వాస్తవమై యున్నట్లుగానే, ఆయన తిరిగి వెనుకకు మళ్లలేని గతస్థితిని దాటి వెళ్లిపోయాడనుటకు ఒక ఖచ్చితమైన సంకేతమై యుండినదని, ఆయనకు ఎరుకలేకుండెను.

*అవకాశములన్నిటిలోకెల్లా అతి గొప్ప అవకాశము, అనగా వాస్తవముగా యేసుతో సంభాషించుట సహితము, ఆయనకు బుద్ధివచ్చునట్లు చేయలేనంతగా, హేరోదు పాపము చేత సంపూర్తిగా దహించివేయబడ్డాడు.* పౌలు వివరించిన వారి శ్రేణిలో చేరువాడుగా

దిగజారిపోయాడు: "వారు సిగ్గులేనివారైయుండి నానావిధమైన అపవిత్రతను అత్యాశతో జరిగించుటకు తమ్మునుతామే కాముకత్వమునకు అప్పగించుకొనిరి" (ఎఫెసీయులకు 4:19).

*హేరోదుకు బోధించవలెనని యేసు చేసిన ప్రయత్నపు సదవకాశము దాటిపోయింది.* ఒకనిని దేవుడే పాపమునకు అప్పగించిన ఆలోచన కంటె ఎక్కువ వణకుపుట్టించునది లేక భయానకమైన ఆలోచన క్రొత్త నిబంధనలో మరొకటి లేదు. ఇటువంటి సన్నివేశమును పౌలు పాపము గూర్చి రోమా పత్రిక ఒకటవ అధ్యాయంలో ఇచ్చిన తన జాబితాలో చిత్రీకరించాడు; "ఈ హేతువు చేత వారు తమ హృదయముల దురాశలను అనుసరించి, తమ శరీరములను పరస్పరము అవమానపరచుకొనునట్లు దేవుడు వారిని అపవిత్రతకు అప్పగించెను" (24 వ.); "అందువలన దేవుడు తుచ్ఛమైన అభిలాషలకు వారిని అప్పగించెను" (26ఎ వ.); "చేయరాని కార్యములు చేయుటకు దేవుడు భ్రష్ట మనస్సుకు వారినప్పగించెను" (28బి వ.). నశించిన ఆత్మలను వెదకుటలో ఎప్పుడైనా ఇహమందు జీవించినవారిలో యేసే అత్యంత గొప్ప కనికరముగలవాడై యుండెను. ఆయన తన పద్ధతులలోను తన ప్రేమలోను పరిపూర్ణుడై యుండెను, కానీ హేరోదుతో ఇటువంటిదేదియును ఆయన ప్రస్తావించలేదు. వక్రబుద్ధిగల, విపరీతబుద్ధిగల, పాపిష్టియైన ఇటువంటి వానికి ఎటువంటి నిరీక్షణనైనా కలుగజేసినను అది పందుల యెదుట రక్షణ ముత్యములను వేసినట్లే అని యేసు ఎరిగియుండెను. యేసు హేరోదు నొద్దకు వచ్చినప్పుడు, హేరోదు తన ఆత్మను అదివరకే పాపమునకు అమ్ముకొన్నాడు.

❖◆❖◆❖

*ఒకడు తన జీవితమనెడు తలుపును యేసు క్రీస్తుకు మూసివేయగలడను భయంకరమైన సాధ్యతను హేరోదు మనకు బయలుపర్చుచున్నాడు. ఆయన తనను తాను దుర్నీతి, వ్యామోహము, నరహత్య, పేరాస, మరియు స్వార్థము వైపునకు మళ్లించుకొన్నాడు; ఈ దుష్టత్వములు ఆయన హృదయమును అత్యంత బలహీనమైనదానిగా చేశాయి. ఆయన తన అంతరాత్మలో మారుమ్రోగిన సత్యమును, నీతిని, మరియు న్యాయమును చాటిచెప్పిన ఎటువంటి స్వరమునైనను వ్యతిరేకించాడు. అతడు తన జీవితములో రక్షకుని ప్రేమను గుర్తుపట్టకుండునట్లు చేసిన ఒక మార్గమును అనుసరించాడు. ఆయన యేసును చూచినప్పుడు, యేసును ఏ విధముగ్గానైనను ప్రశంసించలేదు మరియు గుర్తింపునివ్వలేదు. ఆయన చేసినదెల్లా నిస్సారమైన ప్రశ్నలడుగుట, యేసు ఆయన యెదుట వినోద కార్యమును చేయవలెనని ఆశించుట, మరియు ఎగతాళిగా నవ్వుచూ యేసును పరిహాసము చేయుట మాత్రమే. పాపము యొక్క అంతిమ ఫలితమును సూచించుచు దేవుని వాక్యములో స్మారకముగా ప్రతిష్టచేయబడి నిరంతరము నిలిచియుండు అంధకారమయమైన చిత్రము వలె హేరోదు చిత్రీకరింపబడియున్నాడు.*